మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 116/ 17 శుక్రవారం, నవంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842



## కాంగ్రెస్ అధికారంలోకి రాగానే

# పేదలను ఆదుకుంటాం

2 లో

చెరువులు మింగిన ఘనుడు మల్లారెడ్డి

పేదల గుడిసెలు కూల్చి నిలువనీడ లేకుండా చేశాడు

మేడ్చల్ ప్రచారంలో రేవంత్ రెడ్డి హామీ



# ప్రచారంలో దూకుడు పెంచిన కాంగ్రెస్

నేడు హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ

ఏకబిగిన ఖమ్మం, వరంగల్‌లో ప్రచారం

కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదలకు వస్తున్న ఖర్గే

హైదరాబాద్,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ మరోసారి తెలంగాణకు వస్తున్నారు. నవంబర్ 17న శుక్రవారం హైదరాబాద్ కు రానున్న రాహుల్ గాంధీ ఒక్కరోజే ఏకంగా 5 నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకొని, అక్కడి నుంచి హెలికాప్టర్ లో ఉదయం 11 గంటలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పినపాకకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు పినపాకలో రోడ్ షో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. పినపాక నుంచి హెలికాప్టర్లో నర్సంపేటకు రాహుల్ గాంధీ చేరుకోనున్నారు. మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు నర్సంపేటలో రాహుల్ గాంధీ ఉండనున్నారు. నర్సంపేట నుంచి రోడ్డు మార్గం ద్వారా వరంగల్ ఈస్ట్ నియోజకవర్గానికి చేరుకోనున్న రాహుల్ గాంధీ చేరుకోనున్నారు. వరంగల్ ఈస్ట్ లో సాయంత్రం నాలుగు గంటలకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేయనున్నారు. వరంగల్ ఈస్ట్ నుంచి వెస్ట్ నియోజకవర్గానికి అక్కడి నుంచి రాహుల్ గాంధీ వెళ్తారు. సాయంత్రం 6:30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ రాజేంద్రనగర్ రానున్నారు. రాజేంద్రనగర్ సమావేశం అనంతరం రాహుల్ గాంధీ ఢిల్లీ వెళ్లిపోనున్నారు. ఇకపోతే ఇదేరోజు హైదరాబాద్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు బెంగుళూరు నుంచి ప్రత్యేక విమానంలో ఖర్గే బేగంపేట ఎయిర్ పోర్ట్‌కి ఖర్గే చేరుకొనున్నారు. ఉదయం 11 గంటలకు ఖర్గే గాంధీ భవన్‌కు చేరుకొని.. 11 గంటలకు కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ బహిరంగ సభలో ఖర్గే పాల్గొననున్నారు. సమావేశం తర్వాత హైదరాబాద్ లోనే ఖర్గే బస చేసే అవకాశం ఉంది. ఎల్లుండి ఉదయం 10.30 గంటలకు తిరిగి ఖర్గే బెంగళూరుకు వెళ్లనున్నారు.

# ధరణితోనే రైతు బంధు



2 లో

ధరణితో రైతులకే అధికారం ఇచ్చాం

- కాంగ్రెస్ వస్తే మళ్లీ పట్వారీ వ్యవస్థ తప్పదు

- పైరవీకారులు, దళారులు కూడా వస్తారు

మీ భూములను కాపాడుకుంటారా లేదా

-ఏ పార్టీ అయితే మేలు చేస్తుందో ఆలోచించాలి

నిజామాబాద్ ప్రచారంలో సిఎం కెసిఆర్


## చంద్రబాబు మెడికల్ రిపోర్ట్స్‌పై

# అనుమానాలు

-గుండె సమస్యంటూ నివేదికను కోర్టుకు సమర్పణ

-అరెస్ట్‌కు ముందు..తరవాత ఘటనపై సజ్జల సందేహాలు

అమరావతి,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):



ఏపీ మాజీ సీఎం చంద్రబాబు మెడికల్ రిపోర్ట్సును ఆయన లాయర్లు హైకోర్టుకు సమర్పించారు. అందులో ఆయనకు గుండె సమస్య ఉందని నివేదిక ఉండటంపై ఏపీ ప్రభుత్వం ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు. చంద్రబాబు మెడికల్ రిపోర్ట్స్ పై తనకు అనుమానాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు మెడికల్ బెయిల్ మీద మరింతకాలం ఉండడానికి వీలుగా మెడికల్ రిపోర్టు ఇచ్చినట్టుందన్నారు. ఏఐజీ ఆసుపత్రి రిపోర్టు చూస్తే వైద్యులా, పొలిటికల్ డాక్టర్లా అన్నట్టు కనిపిస్తుందని సజ్జల దుయ్యబట్టారు. పబ్లిక్ లైఫ్‌లో ఉంటారు కనుక ఒక అంబులెన్స్ ఉండాలి అని ఇవ్వడం చూస్తే అర్థం అవుతుందన్నారు. చాలా క్యాజువల్‌గా రిపోర్టు ఇచ్చారన్నారు. అరెస్ట్ కాకముందు సభల్లో... వయసు తనకో సమస్య కాదన్న చంద్రబాబు... అరెస్టయ్యాక వయసు, వ్యాధులను ప్రస్తావించడాన్ని ఏమనాలని సజ్జల ప్రశ్నించారు. చర్మ వ్యాధులను ప్రాణాంతక వ్యాధులన్నట్టు ప్రచారం చేశారన్నారు. పొలిటికల్ లైఫ్ గురించి డాక్టర్లు మాట్లాడటం చూస్తే కామెంట్ చేయక తప్పదన్నారు. కోర్టు వైద్యం చేయించుకోమని బెయిల్ ఇస్తే.. అంబులెన్స్‌తో బయట తిరగమని డాక్టర్లే చెపుతున్నారన్నారు. చంద్రబాబు జైల్లో ఉండాలని మేమేం కోరుకోవట్లేదని.. చంద్రబాబు లోపల ఉంటే మాకేం లాభం లేదన్నారు. చంద్రబాబు బయటకి వచ్చి సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు చేసిన స్కాం ఈ వంకలతో పక్కకి పోతోందన్నారు.

## టీడీపీ-జనసేన మధ్య పొత్తు

# శుభపరిణామం

రెండు పార్టీల కలయికతో ఏపీలో కొత్త శకానికి నాంది

టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):

టీడీపీ-జనసేన మధ్య పొత్తు శుభపరిణామని టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చెప్పుకొచ్చారు. రెండు పార్టీల కలయికతో ఏపీలో కొత్త శకానికి నాంది పడిందన్నారు. హిందూపురంలో నిర్వహించిన టీడీపీ-జనసేన సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీతో కలిసి పోటీ చేసేందుకు స్వయంగా ముందుకు వచ్చిన పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. పవన్ కల్యాణ్‌తో తనకు భావసారూప్యత ఉందన్న బాలకృష్ణ.. ఇద్దరూ ముక్కుసూటిగా మాట్లాడుతామని అన్నారు. ఎన్నికల కోసం సుశిక్షితులైన సైనికులుగా రెండు పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏపీలోని అన్ని స్థానాలూ గెలుచుకునే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను టీడీపీ, జనసేన కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బాలకృష్ణ అన్నారు. ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ కండువాతో పాటు జనసేన కండువా కప్పుకొని ఈ సమావేశంలో బాలకృష్ణ మాట్లాడారు. జై జనసేన, జై టీడీపీ అంటూ బాలయ్య నినాదాలు చేశారు.

మార్పు కోసం ...
మారో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## అడుగు దూరంలో ప్రపంచ కప్పు !

నిజంగా ప్రపంచకప్ గెలిచినంత ఆనందంలో దేశ ప్రజలు ఉన్నారు. మనకెప్పుడూ సెమీస్ గండం ఉంటోంది. వరుసగా గత రెండు సెమీస్‌లు న్యూజిలాండ్ చేతిలో ఓటమి చెందడంతో మళ్లీ అదే సీన్ రిపీట్ అవుతుందా అన్న భయం కలిగింది. కానీ రోహిత్ సేన ఉమ్మడి పోరాటం చూస్తే..నిజంగానే కప్పు గెలిచి నంత ఆనందం కలగక మానదు. అంతేనా అంటే..ఈ మ్యాచ్ ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది. మాటల్లో వర్ణించలేని అద్భుతం జరిగిందనే చెప్పాలి. వాంఖేడ్ స్టేడియంలో కోహ్లి తన 50వ శతకాన్ని బాదాడు. సచిన్ 49వ సెంచరీని అధిగమించేందుకు ఆయన సమక్షంలోనే ఈ సెంచరీ బాదడం ఓ విశేషం. ఇలా 50 శతకాలతో కోహ్లి రికార్డు సృష్టించాడు. న్యూజిలాండ్‌పై గెలవడం ద్వారా గత రెండు వరల్డ్ కప్‌ల తలరాతను మార్చారు. బౌలర్ షమీ ఏడు వికెట్లు పడగొట్టి మరో రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లి, శ్రేయస్‌లతో పాటు న్యూజిలాండ్ ఆటగాడు మెకల్సన్ కూడా సెంచరీతో అలరించాడు. ఇలా పరుగుల వదర పారడంతో ప్రేక్షకులు ఎక్కడలేని అనుభూతిని పొందారు. వన్డేల్లో సచిన్ అత్యధిక సెంచరీల రికార్డును బద్దలు కొడుతూ కోహ్లి శిఖరాగ్రంపై రారాజుగా కూర్చున్న తీరు ఓ అద్భుతం!తన ప్రదర్శనపై నెలకొన్న సందేహాలకు బ్యాట్‌తోనే సమాధానమిస్తూ శ్రేయస్ మరో మెరుపు శతకంతో జట్టును తిరుగులేని స్థితికి చేర్చిన వైనం మరో అద్భుతం! తన కసిని ఇంకా పెంచుతూ, బంతిని మరింత పదునెక్కిస్తూ కివీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను ఒంటిచేత్తో కూల్చి.. ఓ వన్డేలో ఏడు వికెట్లు పడగొట్టిన తొలి భారత బౌలర్‌గా షమి రికార్డులకెక్కిన దృశ్యం మహాద్భుతం! ఈ అద్భుతాలన్నీ ఒక్కటైతే.. ఏమవుతుందన్నది రోహిత్ సేన గెలచి చూపింది. బ్యాటింగ్‌లో కోహ్లి, శ్రేయస్ శతకాలతో చెలరేగిన వేళ.. బంతితో షమి విజృంభించిన తరుణాన.. టీమ్‌ఇండియా సగర్వంగా వన్డే ప్రపంచకప్ తుది పోరులో అడుగుపెట్టింది. ఇక కప్పుకు అడుగు దూరంలో నిలిచింది. మన దేశంలో క్రికెట్ అంటే పిచ్చి. గల్లీ నుంచి ఢిల్లీ దాకా అందరూ క్రికెటర్లే. ఈ ఆటకు ఉన్నంత ఆదరణ మరే క్రీడకు ఉండదు. అలాంటిది వరల్డ్ కప్ మహా సంగ్రామం అంటే మాటలా! వరల్డ్ కప్ సాధించాలని.. విశ్వవిజేతగా నిలవాలని ప్రతి జట్టుకు ఉంటుంది. కానీ, అన్ని జట్లకు ఆ అవకాశం దక్కదు. 48 ఏళ్ల వన్డే ప్రపంచ కప్ చరిత్రలో భారత జట్టు ఇప్పటివరకూనాలుగు సార్లు ఫైనల్స్ చేరింది. అందులో రెండింట విజయం సాధించగా.. మరొక దానిలో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 1983లో తొలిసారి సెమీస్‌కు అర్హత సాధించిన టీమిండియా.. ఫైనల్‌లో వెస్టిండీస్‌ను ఓడించి తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది2003లో సెమీస్‌లో కెన్యాపై భారీ విజయాన్ని అందుకున్న భారత జట్టు.. ఫైనల్‌లో మాత్రం ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. 2011లో సెమీస్‌లో దాయాది పాకిస్తాన్ ను మట్టికరిపించిన టీమిండియా.. ఫైనల్‌లో శ్రీలంకను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా అవతరించింది. ధోనీ సారథ్యంలో ఈ అపూర్వ విజయం అందుకోవడంతో రెండోసారి జగజ్జేతగా నిలిచాం. 12 ఏళ్ల అనంతరం మరోసారి భారత జట్టు వరల్డ్ కప్ ఫైనల్స్‌లో అడుగు పెట్టింది. ఈసారి మన ప్రత్యర్థి ఎవరో గురువారంజరిగే ఆస్ట్రేలియా – దక్షిణాఫ్రికా మ్యాచ్ తో తేలనుంది. ఈ జట్లలో విజయం సాధించిన జట్టే.. మన ఫైనల్ ప్రత్యర్థి కానుంది.అయితే ఈ వవిజయం అంత తేలిగ్గా దక్కలేదు. ప్రతికూల పరిస్థితులు తప్పలేదు. ప్రత్యర్థి సులువుగా తలవంచలేదు. అయినా పోటీ ఉంటేనే కదా మన సత్తా తెలిసేది. సవాలు ఉంటేనే కదా గెలుపు విలువ పెరిగేది. అందుకే ఈ పోరు చిరస్మరణీయంగా ఈ విజయం నిలిచిందనే చెప్పాలి. ఛేజింగ్‌లో న్యూజిలాండ్ ఓ దశలో గెలుపు ఖాయం అన్నరీతిలో చెలరేగి ఆడింది. స్టేడియంలో కూర్చున్న వారికి, టీవీల ముందు అతుక్కున్న వారికి కూడా ముచ్చెమటలు పట్టించారు. మొత్తంగా మాయ జరిగిందన్న రీతిలో షమీ బౌలింగ్ మాయ చేయడంతో కప్పుకు మరొక్క అడుగే మిగిలింది. ఆదివారం అహ్మదాబాద్‌లోనూ గెలిచేస్తే ప్రపంచకప్‌కు మూడో ముద్దు పెట్టొచ్చు! వన్డే ప్రపంచ కప్ 2023లో భారత జట్టు వరుసగా పదో విజయాన్ని అందుకొని.. ఫైనల్‌లో అడుగుపెట్టింది. కప్ కొట్టేందుకు ఒకే ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఇలా బుధవారం వాంఖడే వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన సెమ్గీ÷నైల్ పోరులో బ్యాటింగ్‌లో కోహ్లీ, అయ్యర్.. బౌలింగ్‌లో షమీ వీరోచితంగా పోరాడారు. బ్యాటింగ్‌లో అందరూ రాణించినా.. బౌలింగ్‌లో మాత్రం షమీ వీరోచితంగా పోరాడాడు. ఒకానొక సమయంలో కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్(69), డారిల్ మిచెల్(134) మ్యాచ్‌ను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేసినా.. షమీ వారిని దెబ్బకొట్టాడు. ఒకే ఓవర్‌లో కేన్ విలియమ్సన్ (69), టామ్ లాథమ్ (0)ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. ఆపై కూడా కట్టుదిట్టమైన బంతులేస్తూ న్యూజిలాండ్ బ్యాటర్లను పెవిలియన్ దారి పట్టించాడు. నిజంగా ఇది షమీ షో అని చెప్పాల్సిందే. ఓ వైపు సిరాజ్ పరుగులు భారీగా ఇస్తున్నా.. షమీ మాత్రం తన వంతుగా కంట్రోల్ చేస్తూనే వచ్చాడు. వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ భారత శిబిరంలో ఆనందం నింపాడు. ఈసారి జరిగే ఫైనల్ 140 కోట్ల మంది ఆశలకు ప్రతిరూపం రోహిత్ శర్మ సారధ్యంలోని భారతజట్టు ఆ కలను నెరవేరుస్తుందా లేదా అనేది నవంబర్ 19న తేలనుంది. న్యూజిలాండ్‌పై విజయంతో దేశవ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. మ్యాచ్ ముగియగానే భారత క్రికెట్ అభిమాను లు వీధుల్లోకి వచ్చి.. జయహో భారత్.. జై భారత్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొన్నిచోట్ల టపాసులు కాలుస్తూ ఆనందాన్ని పండగగా చేసుకున్నారు. మరోసారి దీపావళి వచ్చిందేమో అన్నట్లుగా దేశం మొత్తం ఆనందంలోకి వెళ్లిపోయింది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫైనల్స్‌కు చేరిన భారత్ క్రికెట్ జట్టుకు అందరూ శుభాకాంక్షలు చెబుతున్నారు. వీధుల్లో పెద్ద ఎత్తున సంబరాలకు దిగారు కుర్రోళ్లు.. ఈసారి కప్ భారత్ దే అంటూ కేరింతలు కొట్టడం కొసమెరుపు.

# ధరణితోనే రైతు బంధు

మొదటి పేజీ తరువాయి






ఆలోచించలేదు. మొట్టమొదటిసారి

రైతుబంధును పుట్టించిందే కేసీఆర్. ఈ పథకం కింద పెట్టుబడి సాయం అందుతుంది. రైతులు పండించిన ధాన్యాన్ని కొంటున్నాం. అదృష్టం బాగాలేక రైతు చనిపోతే వారంలోపే 5 లక్షల బీమా ఇస్తున్నాం. వీటితో రైతుల ముఖాలు తెల్లవడుతున్నాయి అని కేసీఆర్ తెలిపారు. రైతుబంధు దుబారానో లాభమో రైతులు తేల్చాలి. మూడు గంటల కరెంట్ సరిపోతదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. 24 గంటల కరెంట్ ఉండాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి. రైతులందరూ 10 హెచ్‌పీ మోటార్ పెట్టుకోవాలని రేవంత్ అంటున్నారు. 3, 5 హెచ్‌పీ మోటారు ఉంటది రైతుల వద్ద. ఇప్పుడు 10 హెచ్‌పీ మోటార్ ఎవడు కొనియ్యాలా..? వాడి అయ్యా కొనియ్యాల్నా.. యాడికెళ్లి రావాలి. మన వద్ద 30 లక్షల మోటార్లు ఉన్నాయి. ఆలోచించాలి. కరెంట్ బిల్లు ఏంది.. ఎన్ని అవస్థలు.. ఎన్ని లంచాలు గతంలో. ఇవాళ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలడం లేదు. ఏ బాధ లేదు. మంచిగా రైతు పండించుకున్నంత చేతికి డబ్బులు వస్తున్నాయి. ఈ పద్ధతి పోవాలని అంటున్నారు కాంగ్రెసోళ్లు. వారు చాటుకు చెప్తలేరు.. టీవీ ఇంటర్వ్యూల్లో భాజప్తా చెబుతున్నారు. వీటి గురించి ఆలోచించాలి అని కేసీఆర్ సూచించారు. ఎన్నికలు రాగానే ఆగమాగం కాకుండా.. ఈ పదేండ్ల బీఆర్ఎస్ పాలనను, 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనను బేరిజు వేసుకుని, ఆలోచించి ఓటేయాలని సీఎం కేసీఆర్ సూచించారు.మన దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏండ్లు అవుతుంది. కానీ ప్రజాస్వామ్య పక్రియలో రావాల్సినంత పరిణితి రాలేదు. ప్రజాస్వామ్య పరిణితి చెందిన దేశాలు ముందుకు దూసుకుపోతున్నాయి. ఎన్నికలు రాగానే ఆగమాగం కావొద్దు. ఆలోచన చేయాలి. మంచేదో చెడేదో గుర్తించాలి. ప్రజలు గెలిచినప్పుడే వారి ఆకాంక్షలు నెరవేరుతాయి అని కేసీఆర్ అన్నారు. ఈ రోజు బీఆర్ఎస్ తెలంగాణ తెచ్చిన తర్వాత మీ ఆశీర్వాదంతో ప్రభుత్వానికి వచ్చి పదేండ్ల నుంచి పరిపాలన చేస్తున్నాం. ఈ పదేండ్లలో ఏం జరిగింది..? 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏం జరిగింది..? అనేది బేరీజు వేయాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో నిధులు, నీళ్లు లేవు. కరెంట్ లేదు. రైతులు, చైనేతల ఆత్మహత్యలు. వలసలు పోవుడు. చాలా భయంకరమైన బాధలు. మూడు నాలుగు నెలలు మెదడు కరగదీసి, ఒక ప్రణాళిక వేసుకున్నాం. చెట్టు ఒకడు, గుట్టకు ఒకడు ఉన్నాడు. ఇవన్నీ గమనించి పేదల సంక్షేమం కోసం చర్యలు తీసుకున్నాం కేసీఆర్ తెలిపారు. వ్యవసాయ స్థిరికరణ జరగాలని రైతులను బాగు చేసుకున్నాం. రైతు బాగుంటే గ్రామం చల్లగా ఉంటుంది.. గ్రామం బాగుంటే దేశం చల్లగా ఉంటుందని రైతులను ఆదుకున్నాం. పెన్షన్‌ను 200 నుంచి రూ. 2 వేలకు పెంచుకున్నాం. సమాజానికి బాధ్యత వహిస్తున్న ప్రభుత్వమే వారిని కాపాడాలని అధికారులకు చెప్పాను. అప్పుడు లెక్కలేసి.. రూ. 600 సరిపోతది అన్నారు. ఈ పేదోళ్ల వద్దనే కొసరల్నా అని పెన్షన్ వెయ్యి చేసుకున్నాం. సంపద పెరుగుతున్న కొద్ది పెన్షన్లు పెంచుకుంటూ పోయాం. అంతే కాకుండా కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలు అమలు చేశాం అని కేసీఆర్ తెలిపారు.

### కాంగ్రెస్ అధికారంలోకి రాగానే

# పేదలను ఆదుకుంటాం

మొదటి పేజీ తరువాయి

**మేడ్చెల్,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

చెరువుల పక్కన భూములు కొని.. చెరువులను మింగిన ఘనుడు మల్లారెడ్డి అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మంత్రిపై తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలను ఆదుకుంటామని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి నెల రూ.2,500 అందిస్తామన్నారు. రైతులకు ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో రూ.400గా ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1200కు చేరుకుందన్నారు. తాము అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పనికి వెళ్లే ప్రతి ఒక్కరికి రూ.12వేలు అందిస్తామన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. గురువారం మేడ్చల్ నియోజక వర్గం పరిధిలోని జవహర్ నగర్ లో జరిగిన కాంగ్రెస్ విజయ భేరి సభలో ప్రసంగించారు. పేదలపై ప్రతాపం చూపే అధికారులు.. చెరువులను మింగిన మల్లారెడ్డిపై చర్యలెందుకు తీసుకోరని ప్రశ్నించారు. నియోజ కవవర్గంలో మల్లారెడ్డి పేదోళ్ల గుడిసెలు కూల్చి వారికి నిలువ నీడ లేకుండా చేసిండు అని విమర్శించారు. జవహర్ నగర్ నుంచి డంపింగ్ యార్డ్ ను తరలించేందుకు కోర్టుకు వెళ్లి ఆదేశాలు తీసుకొచ్చినా కూడా ప్రభుత్వం తరలించలేదన్నారు. కేసీఆర్, మల్లారెడ్డి తొడుదొంగల్లా దోచుకుంటున్నారు అని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. టికెట్లు అమ్ముకున్న మల్లారెడ్డికి కేసీఆర్ మళ్లీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చాడు. కేసీఆర్ ఎన్ని వందల కోట్లకు టికెట్ అమ్ముకున్నారని విమర్శించారు. మేడ్చల్ కు ఐటీ కంపెనీలు తెస్తామన్న హామీని తుంగలో తొక్కారు అని ఆరోపించారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆగమైందన్నారు. తెలంగాణను ఆగం చేసిన కేసీఆర్ ను పొలిమేరలు దాటే వరకు తరమాలి అని పిలుపునిచ్చారు. తెలంగాణలో పేదల పరిస్థితి దారుణంగా ఉందని, ఈ ధరలు, ఈ పాలనతో బతికే పరిస్థితి లేదని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు.





# బిజెపిలో మరో వికెట్ డౌన్

### వికెట్లు పడుతున్నా నింపాదిగా ఆడుతున్న బిజెపి గెలవాలన్న పట్టుదలా..పరిస్థితికి దూరంగా పార్టీ

**హైదరాబాద్,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

దున్నపోతు మీద వానపడ్డట్టుగా బిజెపి పరిస్థితి ఉంది. ఎవరుంటే ఉన్నారు..పోతే పోయారు అన్న రీతిలో ననాయకత్వం ఉంది. ఒక్కో వికెట్ పడుతున్నా నింపాదిగా ఆడుతున్నారు. గెలవాలన్న తపన కానీ, పట్టుదల కానీ బిజెపిలో కనిపించడం లేదు. బండి సంజయ్ అందరినీ కూడగట్టి పార్టీలో చేర్పిస్తే..ఇప్పుడున్న పార్టీ వైఖరి కారణంగా ఒక్కొక్కరే జారుకుంటున్నారు. ఇక బిజెపిలో ఉంటే లాభం లేదని, బిజెపిలో ఉంటూ బిఆర్‌ఎస్‌కు జై కొట్టలేమని బాహాటంగానే విమర్శి స్తున్నారు. తాజాగాబీజేపీ పార్టీకి విజయశాంతి రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి రాజీనామా లేఖను పంపించారు. ఆమె తిరిగి తాను వచ్చిన కాంగ్రెస్?పార్టీలో చేరనున్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఆమెకు టికెట్ దక్కలేదు. కొద్ది రోజుల నుంచి పార్టీ అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. ప్రచారం చేయాలని ఆమెను ఎవరూ అడగడం లేదు. ఉత్సవవిగ్రహం లాగా చూస్తూ ఉండలేక పోయారు. బండి సంజయ్ ను తొలగించి.. కిషన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దాదాపు పదేళ్లపాటు బీజేపీలో కొనసాగిన ఆమె 2009లో బయటకు వచ్చి తల్లీ తెలంగాణ పేరు రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ తర్వాత బీఆర్ఎస్ అప్పటి టీఆర్ఎస్‌లో విలీనం చేశారు. 2009లోనే మెదక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి నెగ్గారు. సీఎం కేసీఆర్‌తో విభేదాల వల్ల 2014లో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. అదే ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. నాలుగేళ్ల తర్వాత కాంగ్రెస్‌లో ఆమెకు ఎన్నికల స్టార్ క్యాంపెయినర్, టీపీసీసీకి ఎన్నికల ప్రచార కమిటీ సలహాదారుగా నియమించారు అప్పటి ఏఐసీసీ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ. 2020లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన విజయశాంతి.. అదే ఏడాది డిసెంబర్‌లో అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరారు. అయితే బిజెపిలో ఇమిడే పరిస్థితులు లేవని గుర్తించారు. తాజాగా బీజేపీకి రాజీనామా చేసి, మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీసీని ముఖ్యమంత్రిని చేయడమే బీజేపీ లక్ష్యమని తెలంగాణ బీజేపీ చెబుతున్నా అసలు పార్టీలో ఎవరుంటున్నారో..ఎవరు పోతున్నారో కూడా పట్టించుకోవడం లేదు. ప్రధాని నుంచి పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వరకు అంతా బిసి ముఖ్యమంత్రి అన్న నినాదంతో ఉన్నారు. నినాదాలతోనే తెలంగాణలో అధికారం దక్కించుకుంటామన్న భావనలో ఉన్నారు. ఇకపోతే పవన్ కళ్యాణ్ పొత్తు కూడా లాభిస్తుందన్న భావనలో ఉన్నారు. ఎన్డీఏ భాగస్వామిగా తెలంగాణలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారని, బీజేపీ, జనసేన పార్టీ అభ్యర్థుల తరుపున పవన్ కళ్యాణ్ ప్రచారం నిర్వహిస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తాం. తపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని అంబేడ్కర్ చెప్పారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలకు ఇస్తాం. బీజేపీ అధికారంలోకి రాగానే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేస్తాం అంటూ ప్రకటనలు చేస్తున్నారు. మొత్తంగా విజయశాంతి బాటలోనే మిగతా వారు కూడా మెల్లగా బిజెపి నుంచి జారుకునే పరిస్థితులు ఉన్నాయి.

మరో ఉదయం

# బిఆర్ఎస్ లో చేరిన వెలిశాల నాయకులు.

**టేకుమట్ల: నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి తోనే భూపాలపల్లి అభివృద్ధి సాధ్యం మని వెలిశాల గ్రామ నాయకులు అన్నారు.బీ ఆర్ఎస్ పార్టీ లొ చేరిన సందర్భంలో వెలిశాల గ్రామ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి నాయకత్వంలో పని చేయడానికి మాత్రమే తాము ఇష్టపడుతున్నామని ఆయన తోనే భూపాలపల్లి అభివృద్ధి చెందుతుందని నమ్మకం ఉందని అన్నారు. కావున బిఆర్ఎస్ పార్టీలో చేరానని అన్నారు. టేకుమట్ల మండలంలో గౌరవ గండ్ర వెంకటరమణ రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొన్నారు..మండల పార్టీ అధ్యక్షులు సట్ల రవి గౌడ్, ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి గారు జడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి , వెలిశాల ఎంపిటిసి గంధం సారయ్య , మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకునూరి. తిరుపతి ,దుబ్యాల ఎంపిటిసి సంగి రవి , టేకుమట్ల గ్రామ సర్పంచ్ పొలాల సారొత్తం రెడ్డి , ఎంపిటిసి అది సూనిత రఘు రామకృష్ణ పూర్ సర్పంచ్ అడగాని రామ రావ్ , వెలిశాల గ్రామ అధ్యక్షులు పల్లేర్ల తిరుపతి, ఉప సర్పంచ్ ఉటిపెల్లి శ్రీను, గదార్ల ప్రభాకర్, బోయిని తిరుపతి, అందె కూమర్, %ఎం% అక్రమ్, బోయిని శ్రీకాంత్, పోతుగంటి పవన్ లు పాల్గొన్నారు.పార్టీ లో చేరిన నాయకులు రెవెల్లి. రాజేందర్ దుగ్యాల సంపత్ ,తూర్పటి అంజి,తూర్పటి ఐలయ్య ,తూర్పటి సమ్మయ్య ,శేర్ల లింగ స్వామి తూర్పటి హరికృష్ణ ,దూగ్యాల శ్రీకాంత్ ,నేరళ్ళ రాజేందర్ తదితరులు ఉన్నారు.



# ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసమే పోరాడుతా..


## ప్రజా ఉద్యమాల కోసం ఎన్ని కేసులైన భరిస్తా.

**మొయినాబాద్:నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

మంత్రి కేటీఆర్ ఏ ముఖం పెట్టుకొని ఈ ప్రాంతానికి వచ్చాడని , ఇచ్చిన హామీ నిలబెట్టుకొలేని వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భీమ్ భరత్ అన్నారు.మంత్రి రోడ్ షో పర్యటన సందర్భంగా కేటీఆర్ మాట్లాడిన మాటలపై స్పందించి మీడియాతో మాట్లాడుతూ ప్రజల సాక్షిగా 111 జీవోను రద్దు చేశామని మొయినాబాద్ ప్రజల ముందే పూర్తిగా అబద్ధం మాటలు చెప్పి పబ్బం గడపడానికి వచ్చాడా !అని ప్రశ్నించారు? గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి కాల యాదయ్య రోడ్ షో నిర్వహించారు ఈ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్. మంత్రి పట్నం మహేందర్ రెడ్డి పీ రంజిత్ రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా రోడ్ షోలో హాజరైన బి ఆర్ ఎస్ నాయకులను కార్యకర్తలనుదేశించి మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీమ్ భరత్ పై చేసిన ఆరోపణలపై భీమ్ భరత్ ఘాటుగా స్పందించారు ఏ పార్టీవాడైనా పరిపాలన చేసినవాడు పరిపాలన గురించి చెప్పాలి కానీ మంత్రి కేటీఆర్ కాల యాదయ్య నాపై చేసినటువంటి అసత్య ఆరోపణలు పూర్తి అవాస్తవమని దమ్ముంటే ఏ చర్చ కైనా సిద్ధమని సవాల్ విసిరారు . 10 సంవత్సరాలు పరిపాలనలో ప్రజలకు ఒరిగిందేందో చేసిన అభివృద్ధి చెప్పకుండా అక్కడ వచ్చినటువంటి స్వల్ప జనాన్ని చూసి చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ గెలుపును గ్రహించిన మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. చేయని అభివృద్ధి ప్రజల ముందు చెప్తే తిరగబడతారని ఉద్దేశంతో నాపై అసత్ ఆరోపణలు చేసి వెళ్లారని విమర్శించారు .111 జీవో పై మాట్లాడిన మాటలు ఎంత అబద్ధం చేవెళ్ల ప్రజలు గమనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు.. నాపై కేసులు నేను ఎవరినో దోచుకుంటే పెట్టలేదని అణగారిన ప్రజల పట్ల కెసిఆర్ లాంటి నిరంకుశ పాలన లో ప్రజల హక్కులను కాలరాసి. పేద ప్రజల భూములు లాక్కొని ప్రజలను హింసిస్తుంటే తిరుగుబాటు చేసినందుకు అయ్యాయని అన్నారు.పేద ప్రజల కోసం పోలీస్ లాఠీ దెబ్బలకు తుపాకి తూటాలకు ఎదురెల్లి పోరాడి పేద ప్రజలకు వందల ఎకరాల భూములు తిరిగి ఇప్పించానని అన్నారు. కాలే యాదయ్య చేవెళ్ల ప్రజలను ముంచడమే కాకుండా తిరుపతి దేవుని కూడా మోసం చేసి ఆర్థికంగా స్థిరపడిన దుర్మార్గుడని ఆరోపించారు .చేవెళ్ల ప్రజలకు నేనేంటో తెలుసని నేను కొన్ని ఏళ్లపాటు సమ సమాజ నిర్మాణం కోసం బడుగు ,బలహీన వర్గాల కోసం అలుపెరుగని పోరాటం చేశానని చేవెళ్ల ప్రజలకు తెలుసని తెలిపారు .కొత్తగా కేటీఆర్ వచ్చి నా గురించి చెప్పాల్సిన అవసరం లేదని ఈరోజు రోడ్ షో చూసిన జనాన్ని బట్టి కాల యాదయ్య కారు గుర్తు చేవెళ్ల గడ్డకు కథమైందని కాంగ్రెస్ గెలుపును ఎంతమంది కేటీఆర్ లు వచ్చినా ఆపలేరని గుర్తు చేశారు .నిజంగా చేవెళ్ల నియోజకవర్గం కంపెనీలు వస్తే ఆ కంపెనీల్లో చేవెళ్ల నియోజకవర్గం ప్రజలకు ఎంతమందికి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో దమ్ముంటే కేటీఆర్, కాలే యాదయ్య చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ గెలుపును చూసి ఓర్వలేక భయభ్రాంతులకు గురై పిచ్చెక్కి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని భీమ్ భరత్ అన్నారు. అడ్డగోలుగా వేలకోట్ల రూపాయలు సంపాదించుకున్న కాల యాదయ్య నీతులు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుందని ఎద్దేవ చేశారు. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీ గెలిచిన వెంటనే ప్రజాపాలనేంటో చేసి చూపిస్తామని చేవెళ్ల నియోజకవర్గాన్ని అత్యధికంగా అభివృద్ధి చేస్తామని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి కొట్లాడిన విద్యార్థులపై ఈరోజుకి కేసులు ఉన్నాయని తెలంగాణ ఉద్యమంలో ఉద్యమాలు చేసిన వారిపై కేసులు ఇప్పటికి ఎత్తి వేయలేదని. తండ్రి కొడుకు చెల్లెలు బావ మాత్రం విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని అన్నారు .నాడు తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వారికి కేసులే మిగిలాయని, ప్రజల కోసం పోరాడిన కేసులు కాల యాదయ్యపై ఎన్ని ఉన్నాయో చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన పోరాడిన వారిపై కేసులు నమోదు కావడం సహజం అన్నారు. చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ గెలుపు ఖాయమని అన్నారు.



# పశ్చిమ దేశాల పరిశ్రమల నిష్క్రమణతో లాభపడిన రష్యా!




**మాస్కో, నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

అంతర్జాతీయ కంపెనీలు రష్యా నుంచి నిష్క్రమిస్తుండగా ఏర్ప డిన శూన్యంలో రష్యా వ్యాపారులు వేగంగా ప్రవేశిస్తున్నారు. పశ్చిమ దేశాలకు చెందిన కంపెనీల ఆస్తులు అరకొర ధరలకు కైవశం చేసుకుని రష్యా కంపెనీలు లాభపడుతున్నా యని బ్లూమ్ బర్గ్ వా ర్తా సంస్థ ఒక కథనంలో రాసింది. అమెరికా ఫుడ్ కంపెనీ మెక్‌డోనాల్డ్, ప్యాకే జింగ్ గ్రూపు బాల్, కెమికల్స్ తయారీదారు హెన్కెల్ వంటి కంపెనీలు ఉక్రెయిన్ పైన రష్యా యుద్ధం ప్రకటించాక తమ వాటాదారుల నుంచి, ఆంక్షల రూపంలో అంతర్జాతీయంగా తీవ్ర స్థాయిలో వత్తిడి వచ్చినందున రష్యానుంచి నిష్క్రమించాయి. 2022 -2023లో రష్యాలో పశ్చిమ దేశాల కంపెనీ లు 21 బిలియన్ డాలర్ల వ్యాపారాలను అమ్మటం జరిగిందని ఎకె అండ్ ఎమ్ వార్తాసంస్థ అంచనా వేసింది. రష్యాకు చెందిన నూతన పెట్టుబడిదారులను గురించి బయటి దేశాల్లో పెద్దగా తెలియదు. వారు అమెరికా, యూరోపియన్ యూనియన్ విధించిన ఆంక్షల లిస్టుల్లో లేరు. ఉదాహరణకు కాస్మొటిక్స్, గృహోప కరణాలను ఉత్పత్తిచేసే అలెక్సే సగల్‌కు చెందిన అర్నెస్టు గ్రూపు 2022 సెప్టెంబరులో బెవరేజ్ ప్యా కేజింగ్ పరిశ్రమను 530మిలియన్ డాలర్లకు కొన్నది. ఆ తరువాత ఇదే గ్రూపు ప్రపంచ ప్రసిద్దిగాంచి న హైనెకిన్ బీర్ కంపెనీని ఈ సంవత్సరం ఆగస్టులో కొన్నది. రష్యాలో అత్యంత ధనవంతుడు వ్లదీ మీర్ పొటానిన్ ఫ్రెంచ్ బ్యాంకింగ్ గ్రూపు సొసైటీ జనరల్‌కు చెందిన రోస్ బ్యాంకును గత సంవత్స రం కొన్నాడు. 2022 డిసెంబరులో అమెరికా, బ్రిటన్‌లు పొటానిన్ పైన వ్యక్తిగతమైన ఆంక్షలను విధించాయి. ష్యన్ ఆర్థిక వ్యవస్థను బలహీనపరచటానికి బహుళజాతి కంపెనీలు రష్యానుంచి ని ష్క్రమించాయి. అయితే అలా నిష్క్రమించటాన్ని రష్యా కఠినతరం చేయటంతో వాస్తవంలో రష్యా పారిశ్రామికవేత్తలు బాగా లాభపడ్డారు. రష్యా నుంచి నిష్క్రమించాలంటే బహుళజాతి కంపెనీలు తమ ఆస్తులను 50శాతం తగ్గించి అమ్మాలి. అందుకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. తమ ఆస్తుల మార్కెట్ విలువలో సగంపైన 10శాతం రష్యా ప్రభుత్వానికి చెల్లించాలి.

# కార్తీకంలో అంతా భక్తి భావమే

## అయ్యప్ప దీక్షాపరులకు ప్రత్యేక సమయం

**శ్రీశైలం,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

కార్తీకమాసం వచ్చిదంటే ఓ పక్క శివాలయాలు కిటకిటలాడతాయి. ప్రత్యేక పూజలతో వైష్ణవాలయాల్లో కూడా సందడి నెలకొంది. ఇదే మాసంలో అయ్యప్ప దీక్షలకు ప్రత్యేకం కావడంతో .. దేశవ్యాప్తంగా స్వామియే శరణం అయ్యప్ప అంటూ...మారుమ్రోగుతోంది. అయ్యప్ప దీక్షాధారులు దీక్షలకు దిగుతున్నారు. దీక్షతో ఆరోగ్యం.. ఆధ్యాత్మికత చేకూరుతాయని స్వాములు అంటున్నారు. కేరళ రాష్ట్రంలో ప్రారంభమైన అయ్యప్ప దీక్ష నేడు దక్షిణ భారతదేశమంతటా విస్తరించింది. అన్ని ప్రాంతాల కంటే తెలుగు రాష్టాల్లోన్రే అయ్యప్ప దీక్ష తీసుకున్న వారు కఠిన నియమాలు ఆచరిస్తూ దీక్షా కాలాన్ని పరిపూర్ణం గావిస్తారనే మంచి పేరుంది.అయ్యప్ప దీక్ష మతసామరస్యానికి ప్రతీక. కులం, మతం, చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడ మే దీక్ష పరమార్థం. దీని ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరగడమే కాకుండా దురలవాట్లకు దూరమై, సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుంది. అయ్యప్ప మండల దీక్షతో ఆధ్యాత్మిక చింతన తో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. శాస్త్రీ య పద్ధతుల ప్రకారం పురాతన కాలం నుంచి కొన్ని రకాలైన వ్యాధులకు ఆయుర్వేద చికిత్స చేయడానికి, యోగ సాధనకు మండల కాలం అంటే41 రోజులు ప్రామాణికంగా వాడుతున్నారు. చన్నీటి స్నానం, ఒక్క పూట భోజనం, దేవతా రాధన వంటి అలవాట్లు మనిషి జీవితంపై చక్క టి ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ఉద యం, సాయంత్రాలలో చన్నీటి శిర స్నానాలు చేయడం వల్ల మెదడులోని సున్నిత నరాలు స్పందించి సునిశిత శక్తి, ఏకాగ్రత, ఉత్తేజం కలగడమే కాకుండా శరీరంలోని వేడి కూడా సమతుల్యమవుతుంది. నుదుటిపై చందనం, కుంకుమ, విభూతి ధరించడం వల్ల భృగు మధ్య భాగంలోని అతి సున్నిత నరాలకు చల్ల దనాన్ని ఇవ్వడమే గాక గంధం సువానస మానసిక ప్రశాంతతనిస్తుంది. వనమూలికల తో తయారయ్యే విభూతి యాంటీబాక్టీరియల్ గా పనిచేసి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుం ది. దీక్షా కాలంలో ధరించే నలుపు రంగు బట్టలు వేడిని గ్రహించి దేహానికి వెచ్చదనాన్ని ఇస్తా యి. కాళ్లకు చెప్పులు ధరించకుండా నడవడం వల్ల భూమిపై ఉండే చిన్న చిన్న రాళ్లు, మట్టి గడ్డలు పాదాలకు సున్నితంగా గుచ్చుకుని ఓ రకంగా ఆక్యూపంక్చర్ చర్య జరిగి నరాలకు స్పందన కలుగుతుంది. దాంతో శరీరంలో రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. ఒంటి పూట భోజనం చేయడం వల్ల జీర్ణవ్యవస్థ క్రమబద్ధీకరించబడుతుంది. అయ్యప్ప దీక్షతో మానసిక, శారీరక ఉత్తేజం కలిగి అత్మస్థైర్యం, ఏకాగ్రత పెంపొందుతాయి. ఈ కారణంగానే చాలామంది దీక్షను తీసుకుంటున్నారు. చెడు అలవాట్లను దూరం చేసుకునే క్రమంలో చాలామంది దీక్షలకు సిద్దంగా ఉంటున్నారు.



# కేదార్‌నాథ్ ఆలయ తలుపులు మూత

**రుద్రప్రయాగ్,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

శీతాకాలాన్ని పురస్కరించుకుని కేదార్‌నాథ్ ఆలయ మహా ద్వారాన్ని భయ్యా దూజ్ సందర్భంగా బుధవారం మూసివేశారు. శీతాకాలమంతా ఈ ఆలయం మంచుతో కప్పబడి ఉంటుంది. కాగా, తెల్లవారుజామునే చలిలో వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకోగా, పూజారులు శివునికి పూజలు, ఇతర సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించిన అనంత రం ఉదయం 8.30 గంటలకు మహాద్వారాలను మూసివేశారు. శీతాకాలమంతా ఈ ఆలయాన్ని మూ సివేసి ఉంచుతామని బద్రినాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ చైర్మన్ అజేంద్ర అజయ్ తెలిపారు. ఆల య ద్వారాలు మూసివేసిన తర్వాత కేదార్‌నాథుని పంచముఖి డోలిని పూజారులు భుజంపై మోసు కుంటూ ఊరేగింపుగా తీసుకెళ్లి ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయంలో భద్రపరిచారు. ఈ శీతాకాలమంతా స్వామివారికి అక్కడే పూజలు నిర్వహిస్తారు. కాగా, ఈ సీజన్‌లో కేదార్‌నాథుడిని 19.5 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.



# ఒడుకు వచ్చిన నాలుగు టన్నుల తిమింగలం

**ముంబయి,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

తిమింగలం పిల్ల తీరానికి వచ్చి ఇసుకలో కూరుకుపోయింది. అది అక్కడే కొట్టుమిట్టాడుతుండగా గమనించిన స్థానికులు, పర్యాటకులు కలిసి 40 గంటలు శ్రమిం చి దానిని తిరిగి నీళ్లలోకి పంపించగలిగారు. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా గణపతిపులే తీరంలో ఈ ఘటన చోటుచేసుకుంది.దీని బరువు నాలుగు టన్నులు ఉండడంతో ఇసుక నుంచి బయటకు లాగి, దీనిని సముద్రంలోకి పంపించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒక బెల్టుకు దీనిని కట్టి లాగే ప్రయత్నం చేస్తే ఆ ప్రాణికి గాయాలయ్యాయి. దీంతో వాటిని నయం చేసే వైద్యుల్ని రప్పించారు. పోలీసులు, తీరగస్తీ దళం కూడా రంగంలో దిగాల్సి వచ్చింది. సోమవారం ఉదయం నుంచి ప్రయత్నాలు మొదలైతే బుధవారం పడవ సాయంతో ఆ ప్రాణిని సముద్రం లోపలకు 7-8 నాటికల్ మైళ్ల దూరం లాక్కొని వెళ్లి వదిలారు.



# విజయ రమణారావు బహిరంగ చర్చకు సిద్ధం కావాలి

## మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు

**హైదరాబాద్,నవంబర్16 (మరో ఉదయం న్యూస్):**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయ రమణారావుపై ఈడీ, ఆదాయపన్ను శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. విదేశీ అకౌంట్లు, పలు కంపెనీల్లో పెట్టుబడులపై ప్రజలకు జవాబు చెప్పాల్సిందేనన్నారు. ఐదు రోజుల్లో ఢిల్లీకి వెళ్లి హోంశాఖతో పాటు ఈడీకి ఫిర్యాదు చేస్తానని, దేశంలోనే పేరున్న ఆడిటర్ తో విదేశీ ఖాతాలు, పెట్టుబడులపై ఆరా తీస్తామన్నారు. 2018లో 2023లో వేర్వేరు పాన్ కార్డు నెంబర్లు ఎందుకు ఇచ్చారని, సూట్ కేస్ కంపెనీల్లో పెట్టుబడులపై సంబంధిత అధికారులు విచారణ చేసి నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు గోనె ప్రకాష్ రావు. విజయ రమణారావు బహిరంగ చర్చకు సిద్ధం కావాలని, విదేశీ ఖాతాలపై ప్రజలకు జవాబు ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఈడీ రాకముందే పోటీ నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# టైగర్-3 కి మంచి రెస్పాన్స్ ఖుషీలో సల్మాన్ ఖాన్

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ టైగర్ ఫ్రాంఛైజీ సినిమాలకు క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇదే జోనర్‌లో వచ్చిన టైగర్ 3 మరోసారి ఈ క్రేజ్‌ను బాక్సాఫీస్‌ను రుచి చూపించింది. మనీశ్ శర్మ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన చిత్రం టైగర్ 3. కత్రినాకైఫ్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషించిన టైగర్ 3 దీపావళి కానుకగా నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది.భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా సక్సెస్‌ఫుల్‌గా స్క్రీనింగ్ అవుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిల్తుస్తోంది. టైగర్ 3 ఇప్పటివరకు గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.271.50 కోట్లు వసూళ్లు రాబట్టింది. వీటిలో ఇండియా నుంచి రూ.180.50 కోట్లకు పైగా.. ఓవర్సీస్ నుంచి 59.50 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోన్న నేపథ్యంలో ప్రేక్షకులు, అభిమాన లోకానికి ధన్యవాదాలు తెలియజేశాడు సల్మాన్ ఖాన్. టైగర్ 3కి ప్రేక్షకులు, అభిమానుల నుండి వచ్చిన స్పందన పట్ల చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులు టైగర్ 3 చిత్రానికి అద్భుతమైన ఓపెనింగ్స్ అందించారు. టైగర్ ఫ్రాంచైజీ మూడో భాగం కూడా విజయవంతమైన కథను అందిస్తున్నందుకు నేను చాలా సంతోషంగా ఉన్నానంటూ తన ఎక్జయిట్‌మెంట్ తెలియజేశాడు సల్లూభాయ్. మరి రానున్న రోజుల్లో టైగర్ 3 నిర్మాతలకు ఇంకెన్ని వసూళ్లు తెచ్చి పెడుతుందనేది చూడాలంటున్నారు సినీ జనాలు. ఇప్పటికే టైగర్ 3 విషయమేంటంటే సల్లూభాయ్ కెరీర్‌లో రూ.100 కోట్ల గ్రాస్ సాధించిన 17వ సినిమాగా నిలిచింది. దీంతో ఏ ఇండియన్ స్టార్ హీరో నమోదు చేయని అత్యంత అరుదైన రికార్డును నెలకొల్పి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా నిలుస్తున్నాడు సల్లూభాయ్. హిందీ, తమిళం, తెలుగు భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన టైగర్ 3లో అశుతోష్ రాణా, అనుప్రియా గోయెంకా, రిద్ధి డోగ్రా, అంగద్ బేడి కీలక పాత్రల్లో నటించారు. టైగర్ ఫ్రాంఛైజీలో ఏక్తా టైగర్, టైగర్ జిందా హై తర్వాత వస్తున్న సినిమా కావడం, అంచనాలకు టైగర్3 ఏ మాత్రం తగ్గకపోవడంతో అభిమానులు సంబురాలు చేసుకుంటున్నారు. ఉన్నాయి. టైగర్ 3 ఐమాక్స్ ఫార్మాట్‌లో కూడా విడుదలైంది. యశ్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్యా చోప్రా తెరకెక్కించిన ఈ చిత్రానికి ప్రీతమ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.







# మై నేమ్ ఈజ్ జ్యోతి గా హన్సిక



'దేశముదురు' సినిమాతో తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేసిన హన్సిక అతి తక్కువ సమయంలోనే అగ్రకథానాయికగా గుర్తింపు సొంతం చేసుకుంది. పలు సూపర్ హిట్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన ఆమె కథానాయికగా నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి' శ్రీనివాస్ ఓంకార్ దర్శకత్వంలో వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై బురుగు రమ్య ప్రభాకర్ నిర్మించారు. నవంబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోన్న సందర్భంగా.. హీరోయిన్ హన్సిక ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు చెప్పకొచ్చారు. మేకిన్ మాఫియా ముప్పును స్పృశించే డార్క్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ నేపథ్యంలో సినిమా చేయడం ఇదే తొలిసారి. నా పాత్ర ఇందులో ఓ ట్రాప్‌లో పడుతుంది. శృతి యాడ్ ఏజెన్సీలో పనిచేస్తోంది. ఆమె పాత్ర ఒక పోరాట యోధురాలులాగా ఉంటుంది. ఆత్మవిశ్వాసం ఎక్కువ. దేనికీ వెనకడుగు వేయదు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా వాటిని దాటుకుంటూ వెళ్తుంది. అలాంటి శృతికి ఓ భయంకరమైన, అధిగమించలేదని సమస్య ఎదురవుతుంది? దాని నుండి శృతి ఎలా బయటపడింది అనేదే ఈ చిత్ర కాన్సెప్ట్. వ్యక్తిగతంగా నాకు ఇలాంటి చిత్రాలంటే ఇష్టం. మా అమ్మ డెర్మటాలజిస్ట్. ఈ సినిమా చేసే క్రమంలో నిజంగా స్కిన్ మాఫియా ఉందా? అని అమ్మను అడిగాను. తను కూడా ఎక్కడో ఇలాంటి ఘటన జరిగినట్లు చదివానని చెప్పింది. ఈ మాఫియా ద్వారా సామాన్యుడి జీవితంలో చీకటి వ్యాపిస్తుంది. ఈ సినిమా కోసం దర్శకుడు శ్రీనివాస్ ఓంకార్ పరిశోధన చేస్తున్న సమయంలో కొన్ని అనుకోని సంఘటనలను ఫేస్ చేశారు. ఇటువంటి సున్నితమైన అంశాన్ని టచ్ చేస్తూ.. సినిమా చేయడం సవాలుతో కూడుకున్న అంశం. ఊహించని ట్విస్ట్‌లతో.. చూస్తున్న ప్రతి ఒక్కరికీ థ్రిల్ ఇస్తుందీ సినిమా. ఇలాంటి థ్రిల్లర్ స్పేస్‌లో భాగమైనందుకు చాలా హ్యాపీగా అనిపించింది. ÷నైల్ అవుట్‌పుట్‌తో చూసి చాలా హ్యాపీ. సాంకేతికంగానూ ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలెట్‌గా ఉంటుంది. ఈ ఫ్యామిలీ, ఫ్రెండ్లీ థ్రిల్లర్ ప్రతి కుటుంబాన్ని కదిలిస్తుంది. కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతుంది. నేను ఇండస్ట్రీ కి వచ్చి 20 ఏళ్ళు అవుతుంది. ఇప్పటికి 50 చిత్రాల్లో నటించగా, ఇంకా భిన్నమైన పత్రాలు చేయాలనుంది. ప్రతి పాత్రను డ్రీం రోల్ గానే భావిస్తా. ప్రస్తుతం తమిళ చిత్రాలతో చాలా బిజీగా ఉన్నాను.. అందుకే నా తెలుగు ఫిల్మోగ్రఫీలో కొంత గ్యాప్ వచ్చింది. నా కెరీర్ విషయంలో ఎప్పుడూ బాధపడలేదు. అవకాశాలు ఉన్నా, లేకున్నా.. నేనిప్పుడూ ఇలానే ఉన్నాను. నటన పరంగా మాత్రం నేనింకా సంతృప్తి చెందలేదనే చెబుతాను.. ఇంకా ఎన్నో గొప్ప పాత్రలు చేయాలని ఉంది. నా కెరీర్ ప్రారంభంలో అల్లు అర్జున్, ప్రభాస్‌తో కలిసి పనిచేసినందుకు నేను గర్వపడుతున్నానని పేర్కొంది



# మొన్న రష్మిక .. నేడు కాజల్

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా పై ఓ మార్ఫింగ్ వీడియోను క్రియేట్ చేసి ఆకతాయిలు ఇబ్బందిపెట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటన మరువకముందే మరో స్టార్ నటిని ఆకతాయిలు టార్గెట్ చేశారు. బాలీవుడ్ నటి కాజోల్ పై ఓ డీప్ ఫేక్ వీడియో క్రియేట్ అయ్యింది. కాజోల్ ఫేస్‌ను వాడుకుని ఫేక్ వీడియో సృష్టించారు ఆకతాయిలు. ఇందులో కాజోల్ మార్ఫింగ్ ముఖంతో ఉన్న ఆమె దుస్తులు మార్చుకున్నట్లు ఉంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. కాగా దీనిపై నెటిజన్లు, కాజోల్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఫేక్ వీడియో అని.. దీనిని నమ్మొద్దంటూ పోస్టులు పెడుతున్నారు. రష్మిక మందన్నా సంబంధించిన ఓ డీప్‌ఫేక్ వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. జారా పటేల్‌అనే ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌కి సంబంధించిన వీడియోకి రష్మిక ముఖాన్ని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అదికాస్తా వైరల్‌గా మారింది. ఇక దీనిపై నెటిజన్లు, రష్మిక అభిమానులే కాదు పలువురు స్టార్స్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. అమితాబ్ బచ్చన్ మొదలుకుని, విజయ్ దేవరకొండ,నాగ చైతన్య, సాయి ధరమ్ తేజ్, మృణాల్ ఠాకూర్ ఇలా టాలీవుడ్ ప్రముఖులు అందరూ కూడా రష్మికకు మద్దతుగా నిలిచారు. దీనిపై వెంటనే యాక్షన్ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సంక్రాంతి బరిలో పలు సినిమాలు

ప్రతి సంక్రాంతి పండుగ సినీ పరిశ్రమలో చాలా ముఖ్యమైనది. ఆ రోజునే చాలామంది నిర్మాతలు తమ సినిమాలను థియేటర్లలో విడుదల చేసి తమ తమ అదృష్టాలను పరీక్షించుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో 2024 సంక్రాంతికి కూడా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా డజన్ సినిమాల వరకు విడుదలకు సిద్ధమయ్యాయి. మళ్లీ ఇందులోనూ అందరూ పెద్ద స్టార్లు, బడా సంస్థల నుంచి భారీ బడ్జెట్‌తో వస్తున్నవే కావడం విశేషం. ముఖ్యంగా మహేశ్‌బాబు గుంటూరుకారం, రజనీకాంత్ లాల్ సలామ్, నాగార్జున నా సామిరంగా, వెంకటేశ్ సైంధవ్, విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్, రవితేజ ఈగల్, ప్రశాంత్ వర్మ హనుమాన్, సుందర్ సీ అరణ్మై4 ,శివ కార్తికేయన్ అయలాన్(ం÷ూజ్లీ÷జీజీని), ధనుష్ కెప్టెన్ మిల్లర్ (అజూబిజీతిని ఓత్గి÷ౖ÷స), విజయ్ సేతుపతి హ్యాపీ క్రిస్మస్ వంటి సినిమాలు ఈ సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించి ప్రమోషన్స్ కూడా ప్రారంభించారు. అయితే ఎన్నడూ లేని విధంగా 10,12 సినిమాలు పొంగల్ రిలీజ్‌కు సిద్ధం అవుతుండడంతో మేకర్స్, సినీ అభిమానుల్లో కాస్త కలవరం మొదలైంది. ఇన్ని సినిమాలు విడుదలైతే వాటికి థియేటర్లు దొరకడం, కలెక్షన్లు కావడం చాలా కష్టం అయ్యే పరిస్థితులు ఉండడంతో ఈ రేసులో నుంచి ఎవరైనా తప్పుకుంటారా లేదా అనే చర్చలు మొదలయ్యాయి. ఇందులో ఈగల్, హనుమాన్ సినిమాలు వాయిదా వేసుకుంటున్నారారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చినా సదరు నిర్మాతలు ఖండించి మేము వెనకడుగు వేసేదే లేదని సినిమాను తప్పకుండా విడుదల చేస్తామంటూ ప్రకటించారు. నా సామిరంగా విషయం తెలియాల్సి ఉంది.ఈక్రమంలో తాజాగా దిల్ రాజు నిర్మాతగా పరశురాం దర్శకత్వంలో విజయ్ దేవరకొండ,, మృణాల్ జంటగా రూపొందుతున్న ఫ్యామిలీ స్టార్ సినిమా విడుదలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలో ఇంకా చిత్రీకరించాల్సిన సన్నివేశాలు ఉండడం, అమెరికా వీసా సమస్యలు ఎదురవడంతో ఈ చిత్రాన్ని ఫ్రిభ్రవరి18న రిలీజ్ చేయాలని చూస్తూన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే లైగర్ దారుణమైన ఫ్లాప్‌తో నిరాశలో ఉన్న అభిమానులకు ఇప్పుడు సినిమా వాయిదా పడడం మింగుడు పడడం లేదు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com